సాక్షి
నాగర్‌కర్నూల్
గురువారం, 31, జూలై, 2025



జడ్చర్లకు బైపాస్
జడ్చర్ల బైపాస్ నిర్మాణానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పచ్చజెండా ఊపారు.

వివరాలు 8లో ▸



జూరాలకు భారీ వరద
జూరాల ప్రాజెక్టుకు బుధవారం ఎగువ నుంచి 1.78 లక్షల వరద వచ్చి చేరింది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.2 /21.3

వాతావరణం
ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు



ఉప్పునుంతల: వైద్యులు ఆస్పత్రిలో రోగులకు అందుబాటులో ఉంటూ, మెరుగైన సేవలు అందించాలని, విధుల్లో నిర్లక్ష్యం చేసే వైద్యులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త (డీసీహెచ్‌ఎస్) డాక్టర్ రామకృష్ణ హెచ్చరించారు. బుధవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో వైద్య సిబ్బంది హాజరు రిజిస్టర్, ఓపీ రిజిస్టర్లను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులతో మర్యాదగా మెలగాలని సూచించారు. మందుల స్టాక్ వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు స్వప్న, శివలీల, నర్సింగ్ ఆఫీసర్ ఉఫత్, నిర్మల, ఫార్మసిస్టు కుమారచారి ఉన్నారు.

పీఏసీఎస్ తనిఖీ



ఉప్పునుంతల: స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్)ను బుధవారం నాబార్డు అధికారులు శ్రీనివాస్‌రావు, స్వప్నిల్ తనిఖీ చేశారు. 2025 మార్చి 31వ తేదీ వరకు గత ఆర్థిక సంవత్సరంలో కొనసాగిన లావాదేవీలకు సంబంధించిన రికార్డులను అధికారులు పరిశీలించారు. వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్)కు సంబంధించిన వివరాల గురించి ఆరా తీశారు. అదేవిధంగా వడ్డీ రిబేట్‌కు సంబంధించి రైతుల ఖాతాలో జమచేసిన అంశాలను పరిశీలించారు. పంట, దీర్ఘకాలిక, ఇతర రుణాలు, రికవరీకి సంబంధించిన రికార్డులను చూశారు. పీఏసీఎస్‌లోని రికార్డు గది, లాకర్ రూం, ఎరువుల నిల్వ గోదాంలను వారు పరిశీలించారు. సంబంధించిన వివరాలను పీఏసీఎస్ చైర్మన్ సత్తు భూపాల్‌రావు, సీఈఓ రవీందర్‌రావులను అడిగి తెలుసుకున్నారు. నాబార్డు అధికారులు, డీసీసీబీ ఏజీఎంలు దయాకర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, మేనేజర్ రవికుమార్ పాల్గొన్నారు.

‘వన్య ప్రాణులకు హాని తలపెట్టొద్దు’

మన్ననూర్: వన్యప్రాణుల బారిన పడి మృత్యువాత పడిన పశువుల యజమానులకు అటవీశాఖ తరుపున ప్రతి ఏటా నష్ట పరిహారం చెల్లిస్తున్నామని మన్ననూర్ అటవీశాఖ అధికారి (ఎఫ్‌ఆర్‌ఓ) వీరేశం తెలిపారు. అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యం పూర్తిగా వన్య ప్రాణులకు ఆవాసాలుగా గుర్తించినట్లు తెలిపారు. అయినప్పటికీ దశాబ్దాల కాలంగా ఈ ప్రాంతంలోని అటవీ సమీప గ్రామాల్లో నివాసం ఉంటున్న రైతులు పాడి పశువులను మేత కోసం అడవిలోకి వెళ్తుతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. అటవీ పరిసర ప్రాంతంలో పెద్ద పులులు, చిరుతలు పశువుల మీద దాడి చేసి చంపేసి తింటాయి. ఈ క్రమంలో పశువుల యజమానులకు నష్ట పరిహారంగా 2020–21లో 30 మందికి, 2022–23లో 50 మందికి, 2023–24లో 77 మందికి 2024–25లో ఇప్పటి వరకు 43 మందికి నష్ట పరిహారంగా డబ్బులు చెల్లించినట్లు పేర్కొన్నారు. పశువులను నష్టపోయిన వారికి పరిహారం అందజేస్తున్నామని, ఎట్టి పరిస్థితిలో వన్యప్రాణులకు హాని తలపెట్టకుండా ఉండాలని ఆయన రైతులకు, స్థానికులకు విజ్ఞప్తి చేశారు. నిబంధనలు అతిక్రమించి ప్రవర్తిస్తే వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: పాలమూరులోని ఇండోర్ స్టేడియంలో బుధవారం ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–11 విభాగం బాలబాలికల బ్యాడ్మింటన్ ఎంపికలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ ఎంపికల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎల్.రవికుమార్ మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కోచ్ గోపాల్, సీనియర్ క్రీడాకారుడు సయ్యద్ పాల్గొన్నారు. కాగా..బాలుర సింగిల్స్‌లో అర్విన్ భాస్కర్ (ప్రథమ), విహాన్ (ద్వితీయ), బాలికల్లో డి.శ్రీహాస (ప్రథమ), లాస్యశ్రీ (ద్వితీయ), బాలుర డబుల్స్‌లో ఎస్.విహాన్–విశ్వతేజ, బాలికల డబుల్స్‌లో ఆద్య–అనుశ్రీలను ఎంపిక చేశారు.

రహదారులకు మహర్దశ

ఉమ్మడి జిల్లాలో రోడ్ల విస్తరణకు నిధులు కేటాయించిన ప్రభుత్వం

- మహబూబ్‌నగర్ సర్కిల్ పరిధిలో 380.85 కి.మీ మేర రోడ్ల నిర్మాణానికి రూ.434 కోట్లు
- వనపర్తి సర్కిల్‌లో 15 రోడ్ల నిర్మాణానికి రూ.399.34 కోట్లు మంజూరు
- హైబ్రిడ్ యాన్యూటీ విధానంలో పనులు చేపట్టేందుకు చర్యలు
- జిల్లాలు, మండలాలు, గ్రామాల కనెక్టింగ్ రోడ్లకు ప్రాధాన్యం



ఏళ్లతరబడిగా మరమ్మతుకు నోచుకోని చారకొండ- మర్రిపల్లి రోడ్డు

సాక్షి, నాగర్‌కర్నూల్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కీలకమైన రహదారులకు మహర్దశ పట్టనుంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వీటి విస్తరణ కోసం పెద్ద ఎత్తున నిధులు విడుదల చేసింది. మహబూబ్‌నగర్, వనపర్తి సర్కిళ్ల వారిగా ఉమ్మడి జిల్లాలోని మొత్తం 41 రోడ్ల విస్తరణ, బలోపేతం చేసేందుకు రోడ్లు, భవనాల శాఖ నిధులు కేటాయించింది. ప్రధానంగా జిల్లాలను అనుసంధానం చేస్తూ కొనసాగుతున్న రహదారులతోపాటు మండలాలు, గ్రామాలకు కనెక్టింగ్ రోడ్లను విస్తరించనున్నారు. మహబూబ్‌నగర్ ఆర్‌అండ్‌బీ సర్కిల్‌లో మహబూబ్‌నగర్, జోగుళాంబ గద్వాల, నారాయణపేట జిల్లాలు ఉండగా.. వీటి పరిధిలోని 26 రోడ్ల నిర్మాణానికి సంబంధించి మొత్తం 380.85 కి.మీ., మేర రోడ్లను విస్తరించనున్నారు. ఇందుకు గానూ ప్రభుత్వం రూ.434.19 కోట్లు కేటాయించింది. అలాగే వనపర్తి సర్కిల్‌లో వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాలు ఉండగా.. వీటి పరిధిలో 15 రోడ్లను ప్రభుత్వం డబుల్ రోడ్లుగా విస్తరించనుంది. మొత్తం 279.16 కి.మీ., మేర రహదారులను విస్తరించాల్సి ఉండగా ఇందుకోసం రూ.399.34 కోట్లు మంజూరు చేసింది.

మహబూబ్‌నగర్ సర్కిల్ పరిధిలో..

జోగుళాంబ గద్వాలలోని ఎర్రిగెర- అయిజ- అలంపూర్ రోడ్డు (బల్గెర, మిట్టిదొడ్డి, తుమ్మపల్లి, శాంతినగర్, కొకుంట్ల, శ్రీనగర్, కొరివిపాడు, బొంకూర్)ను విస్తరించారు. అలాగే గద్వాల- రంగాపూర్ రోడ్డు, తుంగభద్ర బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు, గద్వాల- అయిజ రోడ్డు (బింగిదొడ్డి, అయిజ) రోడ్లను మెరుగుపరచనున్నారు.

హైబ్రిడ్ యాన్యూటీ విధానంలో..

ఈసారి రహదారుల నిర్మాణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం హైబ్రిడ్ యాన్యూటీ మోడ్ (హెచ్‌ఏఎం) విధానంలో చేపడుతోంది. పూర్తిస్థాయిలో నిధులను ప్రభుత్వమే ఖర్చు చేయకుండా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో రహదారులను నిర్మించాలని నిర్ణయించింది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారుల నిర్మాణాలను ఈ విధానంలోనే చేపడుతుండగా.. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం హెచ్‌ఏఎం విధానంలో రోడ్ల విస్తరణ చేపట్టనుంది. ఈ విధానంలో రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిధుల్లో 40 శాతం నిధులను ప్రభుత్వం సమకూర్చితే మిగతా 60 శాతం నిధులను ఆయా రోడ్డు నిర్మాణ కాంట్రాక్టు సంస్థలే భర్తీ చేయాల్సి ఉంటుంది. తర్వాత 15 ఏళ్లపాటు రోడ్డు నిర్వహణ బాధ్యతలతోపాటు టోల్ రుసుం సంబంధిత సంస్థలే నిర్వహిస్తాయి. రోడ్ల విస్తరణకు నిధుల కొరత లేకుండా, నిర్ణీత గడువులోగా వేగంగా పనులు పూర్తిచేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

❒ మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తి- జడ్చర్ల వయా బిజినేపల్లి రోడ్డు, మహబూబ్‌నగర్- మంగనూర్ రోడ్డు, మహబూబ్‌నగర్- నవాబుపేట రోడ్డు, వేపూర్ జెడ్పీ రోడ్డు నుంచి కొమ్మిరెడ్డిపల్లి వయా షేక్‌పల్లి, కురుమూర్తిరాయ టెంపుల్ రోడ్డు, గుడిబండ- తిరుమలాపూర్- అప్పంపల్లి రోడ్డు, కోడూరు- కోయిల్‌కొండ రోడ్డు వయా మల్కాపూర్, మణికొండ రోడ్డు, జడ్చర్ల రైల్వేస్టేషన్- కొత్త మొల్గర రోడ్డు, రాజాపూర్- తిరుమలాపూర్, మరికల్- మిన్నాపూర్ రోడ్డు, మక్తల్- నారాయణపేట వయా లింగంపల్లి రోడ్లను పునరుద్ధరించనున్నారు.

నిధులు మంజూరయ్యాయి..

ఉమ్మడి జిల్లాలోని రెండు ఆర్‌అండ్‌బీ సర్కిళ్ల పరిధిలో రోడ్ల విస్తరణ, బలోపేతం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. హైబ్రిడ్ ఆన్యూటీ పద్ధతిలో ఈ పనులను త్వరగా పూర్తిచేసే అవకాశం ఉంది. ప్రధానమైన రోడ్లకు డబుల్ లేన్లు, మిగతా రోడ్లను బలోపేతం చేసేందుకు త్వరలోనే పనులు మొదలవుతాయి.

– దేశ్యానాయక్, ఆర్‌అండ్‌బీ ఈఈ, నాగర్‌కర్నూల్

వనపర్తి సర్కిల్ పరిధిలో..

వనపర్తి- జడ్చర్ల వయా వట్టెం, తిమ్మాజిపేట రోడ్డు, బల్మూరు- నాగర్‌కర్నూల్ వయా గోదల్, తుమ్మన్‌పేట్, అచ్చంపేట- రాకొండ వయా ఉప్పునుంతల రోడ్డు, పెంట్లవెల్లి- వనపర్తి వయా శ్రీరంగాపూర్, అమ్రాబాద్- ఇప్పలపల్లి రోడ్డు, వనపర్తి- ఆత్మకూర్, ఆత్మకూర్- మరికల్ రోడ్డు, వనపర్తి- బుద్దారం రోడ్డు, చిన్నంబావి- చెల్లెపాడు రోడ్ల నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టనుంది. అలాగే బల్మూర్- నాగర్‌కర్నూల్ వయా గోదల్, తుమ్మన్‌పేట్ రోడ్డు, అచ్చంపేట- రాకొండ, పెంట్లవెల్లి- వనపర్తి రోడ్లను డబుల్‌గా విస్తరించనున్నారు.

పెండింగ్‌లో ఉన్నవాటికి మోక్షం..

ఉమ్మడి జిల్లాలో గత కొన్నేళ్లుగా ప్రధాన రహదారుల విస్తరణ, మరమ్మతు పనులు దాదాపుగా నిలిచిపోయాయి. రాష్ట్రాలను అనుసంధానం చేస్తూ చేపట్టిన జాతీయ రహదారుల నిర్మాణాలు మాత్రమే ముమ్మరంగా కొనసాగుతున్నాయి. జిల్లాలను ఒక దానితో మరొకటి అనుసంధానిస్తూ ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్లు, మండల కేంద్రాలను అనుసంధానం చేస్తూ ఉన్న రోడ్ల విస్తరణతోపాటు మరమ్మతుకు సైతం నోచుకోవడం లేదు. సుమారు ఐదేళ్లకుపైగా ఆర్‌అండ్‌బీ రోడ్లకు మరమ్మతు లేకపోవడంతో రోడ్లు పూర్తిగా దెబ్బతిని అధ్వానంగా మారాయి. మండల కేంద్రాల నుంచి గ్రామాలకు వెళ్లే కనెక్టింగ్ రోడ్లు వర్షాలకు దెబ్బతిని, కంకర తేలి దర్శనమిస్తున్నాయి. తాజాగా ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ రోడ్ల విస్తరణ, మరమ్మతుకు నిధులను మంజూరు చేయడంతో ఈ రోడ్ల రూపురేఖలు మారిపోనున్నాయి.



వెల్దండ నుంచి చారకొండ వెళ్లే రోడ్డులో బైరాపూర్ వద్ద వంతెన దుస్థితి

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి



నాగర్‌కర్నూల్: ఎరువులు ఎమ్మార్పీ ధరలకు మించి అమ్మితే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు ఎరువుల దుకాణాలను బుధవారం ఆయన ఆస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో 2,100 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని, మార్క్‌ఫెడ్ వద్ద మరో 770 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని తెలిపారు. రైతులు మొక్కజొన్నకు ఎకరాకు 5 బస్తాలకు మించి యూరియా వాడకూడదని కోరారు. డీలర్లు యూరియాకు వేరే ఎరువులు లింక్ చేసి అమ్మినా.. కృత్రిమ కొరత సష్టించాలని చూసినా కేసులు నమోదు చేసి, లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రతిరోజూ పీఏసీఎస్‌లను తనిఖీ చేయాలని, యూరియా నిల్వలు ఉన్న అన్ని దుకాణాలను ఎరువుల చట్టం పరిధిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తనిఖీల్లో నాగర్‌కర్నూల్ ఏడీఏ పూర్ణచంద్రారెడ్డి, ఏఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పాట్ అడ్మిషన్లు

మన్ననూర్: స్థానిక (మన్ననూర్) సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రూపాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి గానూ ఎంపీసీ, బైపీసీలో మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేసేందుకు గురువారం ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యార్థులు హాజరు కావాలని కోరారు. అర్హత ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేసి మెమో, గ్రేడ్ (మెరిట్) పరిగణలోకి తీసుకొని ఎంపికైన విద్యార్థులకు అదే రోజు ప్రవేశం కల్పిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు 2025 విద్యా సంవత్సరంలో ఒకటే ప్రయత్నంలో పదో తరగతి ఉత్తీర్ణులైన వారు మాత్రమే అర్హులని తెలిపారు.

నిర్లక్ష్యం నిండా ముంచేస్తోంది!



మంచాలకట్ట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణానది

- వర్షాలతో పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- ఇటీవల దుందుభీ నది దాటుతూ వ్యక్తి మృతి
- నదీతీర ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాలో కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో కృష్ణానది పరివాహక ప్రాంతాలు, వాగులు, వంకల్లో నీటి ఉధృతి రోజురోజుకూ పెరుగుతోంది. వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ బాదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్‌రఘునాథ్ ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేస్తున్నప్పటికీ కొందరు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వర్షాలతో నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట ప్రాంతాల వాగుల్లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో వాటిని దాటేందుకు ప్రయత్నిస్తూ ప్రజలుప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల కల్వకుర్తి మండలంలో దుందుభీ నది వాగు దాటేందుకు ప్రయత్నిస్తూ వ్యక్తి మృత్యువాత పడిన ఘటన చోటుచేసుకుంది.

పట్టించుకోని వాహనదారులు

వాగుల్లో నీటి ఉధృతి ఎక్కువగా ఉన్నపుడు వాహనదారులు వాటి దాటేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, నీటి ప్రవాహం మరి ఎక్కువగా ఉన్నపుడు నదులు, వాగులు దాటొద్దని అధికారులు సూచిస్తున్నప్పటికీ కొందరు వాహనదారులు నిర్లక్ష్యంగా ప్రయాణిస్తూ ప్రాణాలు పణంగా పెడుతున్నారు.

పోలీసు నిఘా పెంచాలి

ప్రస్తుతం ఎగువన కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని సోమశిల, మంచాలకట్ట, అమరగిరి ప్రాంతాల్లో కృష్ణానది నిండుకుండలా మారింది. శ్రీశైలం ఆనకట్ట గేట్లు ఎత్తి దిగువనకు నీటిని వదులుతుండటంతో నదీతీర అందాలను చూసేందుకు పర్యాటకులు పెద్దసంఖ్యలో వస్తున్నారు. శని, ఆదివారాల్లో శ్రీశైలం దర్శనానికి వెళ్లే భక్తులతో పాటు పర్యాటకులు వస్తుండటంతో వాహనాలను శ్రీశైలం డ్యాం వద్ద పార్కింగ్ చేస్తుండటంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా పోలీసులు నిఘాను పెంచాలని పలువురు కోరుతున్నారు. సోమశిల, మల్లేశ్వరం, మంచాలకట్ట, అమరగిరి నదీతీర ప్రాంతాల్లో నీటి ప్రవాహంలో పర్యాటకులు సెల్ఫీ మోజులో, మర పడవల్లో ప్రమాదకర ప్రయాణం చేస్తూ ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు.


వాగులు దాటేందుకు ప్రయత్నించవద్దు

కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో ప్రజలు, వాహనదారులు వాటిని దాటేందుకు ప్రయత్నించొద్దు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో నదీ తీర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు, పోలీసు నిఘా కొనసాగిస్తాం. ప్రజలు అనుకోని పరిస్థితుల్లో ప్రమాదాల్లో చిక్కుకుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

– గైక్వాడ్ వైభవ్‌రఘునాథ్, ఎస్పీ, నాగర్‌కర్నూల్

ఇటీవల జరిగిన సంఘటనలు

- ఈ నెల 23న తాడూరు మండలం సిర్సవాడ శివారులో ప్రవహిస్తున్న దుందుభీ నదిలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కొట్టుకుపోతుండగా.. డ్రైవర్ అప్రమత్తమై వాగు నుంచి బయటకు వచ్చి జేసీబీ సహాయంలో ట్రాక్టర్‌ను బయటకు తీశారు.
- ఈ నెల 26న కల్వకుర్తి మండలంలోని రఘుపతిపేట సమీపంలో దుందుభీ నది దాటుతుండగా వరద ఉధృతికి తెల్కపల్లి మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన వ్యక్తి మృతిచెందాడు.



సిర్సవాడ వద్ద దుందుభీ నదిలో కొట్టుకుపోతున్న ట్రాక్టర్ (ఫైల్)

‘రంగసముద్రం’ నీటిని వదలాలి

- రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



జలాశయం వద్ద అధికారులతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

వనపర్తి రూరల్: రంగసముద్రం రిజర్వాయర్ నుంచి భీమా కాల్వ ద్వారా వీపనగండ్ల, చిన్నంబావి మండలాలకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు నీటి పారుదలశాఖ అధికారులను ఆదేశించారు. సాగునీరు విడుదల చేయడం లేదని ఆయా మండలాల రైతులు మంత్రికి ఫిర్యాదు చేయడంతో బుధవారం ఆయన శ్రీరంగాపురంలోని రంగసముద్రం జలాశయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జలాశయంలో పూర్తిస్థాయి నీటిమట్టం ఉన్నప్పటికీ సాగునీరు ఎందుకు వదలడం లేదని అధికారులను ప్రశ్నించారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయకట్టు అవసరాలకు అనుగుణంగా నీటిని విడుదల చేయాలని.. రోజువారీగా ఎంత నీరు విడుదల చేస్తున్నారో లాగ్‌బుక్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. మంత్రి వెంట ఎస్‌ఈ శ్రీనివాస్ రెడ్డి, ఈఈ కేశవరావు, డీఈలు కిరణ్‌కుమార్, రాజ్‌కుమార్, ఏఈఈ వినయ్‌కుమార్, ఏఈ అక్షయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

‘లక్ష్యం మేరకు మొక్కలు నాటండి’


చారకొండ: వన మహోత్సవం కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టి మండలంలో లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని డీఆర్‌డీఓ చిన్న ఓబులేసు అన్నారు. మండలంలోని జూపల్లిలో బుధవారం పర్యటించిన ఆయన వృద్ధాప్య పెన్షన్లు అందిస్తున్న పోస్టాఫీసు తనిఖీ చేశారు. పోస్టాఫీస్ సేవలు పునరుద్ధరణ సందర్భంగా లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. గతంలో వేలిముద్రతో పింఛన్ పొందే వృద్ధులకు మరింత సులభతరంగా ఐరిస్ ద్వారా సేవలు అందుతున్నాయని తెలిపారు. నూతన సాఫ్ట్‌వేర్ పనిచేసే విధానంపై బీపీఎంను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించి, రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం గ్రామంలో నర్సరీని, రహదారి వెంట, కమ్యూనిటీ స్థలాల్లో నాటిన మొక్కలను ఏపీఓ, ఉపాధి అధికారులతో కలిసి పరిశీలించారు. మొత్తం 60 వేల మొక్కలు నాటడంతో పాటు ఇళ్లకు 30 వేల మొక్కలు అందించాలని తెలపారు. కార్యక్రమంలో ఏపీఓ లక్ష్మయ్య, బీపీఎం దేవేందర్, ప్రాథమిక ఉపకేంద్రం వైద్యురాలు ప్రియాంక, ఉపాధి అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ చిన్న ఓబులేసు

సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలి

కందనూలు: రాష్ట్రంలో గురుకుల పాఠశాలలో జరుగుతున్న విద్యార్థుల మరణాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాగర్‌కర్నూల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ గురుకుల పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు మాట్లాడుతూ శనివారం రాత్రి మహాత్మాజ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో ఫుడ్‌పాయిజన్ కారణంగా 110 విద్యార్థులు అస్వస్థతకు గురైతే అధికారులు గాని, ప్రభుత్వం గాని ఎలాంటి విచారణ చేపట్టకపోవడం దారుణమన్నారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా గురుకులాల్లో 94 మంది విద్యార్థులు మృతిచెందారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ఏబీవీపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషనకు తరలించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, పాలమూరు విభాగ్ కన్వీనర్ నరేష్ తేజ, రాష్ట్ర కార్యసమితి సభ్యులు సౌమ్య, అర్జున్, శివశంకర్, బంగారుబాబు, శంతన్, ప్రశాంత్, కల్వకుర్తి నగర కార్యదర్శి వంశీ, అనిల్, సాయి, భరత్, మల్లేష్ యాదవ్, ప్రసాద్ కుమార్, భాను, కీర్తన, కృష్ణవేణి, గాయత్రి, పల్లవి పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

డీడీగా సత్యనారాయణ



కల్వకుర్తి రూరల్: పాడి పరిశ్రమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా సత్యనారాయణయాదవ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ధనరాజ్ బదిలీపై హెడ్ ఆఫీస్‌కు వెళ్లారు. సత్యనారాయణ డీడీ గతంలో ఐదేళ్ల పాటు విధులు నిర్వహించి జనగాం కు బదిలీపై వెళ్లారు. అక్కడ ఏడాది పాటు బాధ్యతలు నిర్వహించి తిరిగి నాగర్‌కర్నూల్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్‌గా వచ్చారు. ఈ సందర్భంగా పలువురు పాడి రైతులు ఆయనను సన్మానించారు. పాల శీతలీకరణ కేంద్రం మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పాడి రైతులకు సమస్య లేకుండా చూడడంతో పాటు వారికి మేలు చేసే చర్యలు చేపట్టాలని కోరారు.

వసతుల లేమితో కాన్పులు చేయలేకపోతున్నాం..

వెల్దండ: మండల కేంద్రంలో తాత్కాలికంగా కొనసాగుతున్న పీహెచ్‌సీ భవనంలో వసతులు సరిగా లేకపోవడంతో కాన్పులు చేయలేకపోతున్నామని వైద్యులు డీఎంహెచ్‌ఓ స్వరాజ్యలక్ష్మికి వివరించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని బుధవారం డీఎంహెచ్‌ఓ పరిశీలించారు. పీహెచ్‌సీ భవనం శిథిలావస్థ చేరడంతో మరమ్మతు కోసం ప్రభుత్వం రూ.40లక్షలు కేటాయించడంతో పనులను ఆమె పరిశీలించారు. కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించి నాలుగేళ్లు అవుతున్నా.. పూర్తి కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో ఏఎస్‌ఎంలు, సూపర్‌వైజర్లు, ఆశాకార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ లక్ష్మణ్, డాక్టర్ సింధు, మురళీకృష్ణ, తదితరులు ఉన్నారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ స్వరాజ్యలక్ష్మి

క్లుప్తంగా

యువకుడి బలవన్మరణం

వనపర్తి రూరల్: జిల్లా కేంద్రంలోని సాగర్ కాలనీలో బుధవారం ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ–2 ఎస్ఐ శశిధర్ వివరాల మేరకు.. సాగర్ కాలనీలో నివాసముంటున్న చీర్ల నరేశ్ (30) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తిచెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య శిరీష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నీటికుంటలో పడి వ్యక్తి మృతి

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్‌కు చెందిన వెంకట్రాములు (45) ప్రమాదవశాత్తు స్థానిక సూరయ్య కుంటలో పడి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి కథనం మేరకు.. వెంకట్రాములు బుధవారం మధ్యాహ్నం చేపల వేటకు కుంటలోకి దిగగా కాళ్లకు వల చుట్టుకొని మునిగిపోతూ అవరడం ప్రారంభించాడు. కుంట మీదుగా వెళ్తున్న స్థానికులు గుర్తించి బయటకు తీసుకురాగా అప్పటికే మృతిచెందాడు. వెంకట్రాములు తల్లితో కలిసి గ్రామంలో ఉంటుండగా.. భార్యాపిల్లలు హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు వివరించారు.

కూతురిపై అఘాయిత్యానికి పాల్పడిన తండ్రికి రిమాండ్

మరికల్: కన్న కూతురిపై అఘాయిత్యానికి పాల్పడిన తండ్రిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాజేందర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆయన వివరాల మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన కుర్మయ్య ఈ నెల 25న తన కూతురిపై అఘాయిత్యానికి పాల్పడి పరారయ్యాడు. పోలీసులు మూడు బృందాలుగా ఏర్పడి నాలుగు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో ఉన్నట్టు గుర్తించి పట్టుకున్నారు. నిందితుడిని జిల్లా కోర్టులో హాజరుపర్చగా.. రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

వట్టెంలో పిచ్చికుక్క స్వైర విహారం

బిజినేపల్లి: మండలంలలోని వట్టెం గ్రామంలో ఒక పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. గ్రామంలోని చిన్నారులు, మహిళలపై దాడి చేసి గాయపరిచిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. కుక్క దాడిలో రణప్రతాప్, సరిత, చింతల శివతో మరో ముగ్గురు గాయపడినట్లు గ్రామస్తులు తెలిపారు. బాధితులను చికిత్స కోసం ఆస్పత్రి తరలించి చికిత్స అందిస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి గ్రామాల్లో కుక్కల బెడదను అరికట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కేజీబీవీలో విద్యార్థినికి పాముకాటు

- కర్నూలు ఆస్పత్రికి తరలింపు.. తప్పిన ప్రమాదం

ఉండవెల్లి: జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలంలోని కలుగోట్ల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం ఓ విద్యార్థిని పాముకాటుకు గురైంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని మెన్నిపాడుకు చెందిన దాక్షాయిని కేజీబీవీలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఉదయం 9:10 గంటలకు పాఠశాల ప్రాంగణంలో తోటి విద్యార్థినులతో కలిసి ప్రార్థన చేస్తుండగా.. పాముకాటుకు గురైంది. గమనించిన తోటి విద్యార్థినులు విషయాన్ని ఉపాధ్యాయులకు తెలియజేశారు. అక్కడే ఉన్న నర్సు లావణ్య విద్యార్థినికి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకొని నాటువైద్యం నిమిత్తం ఇదే మండలం బొంకూరుకు తరలించి ఆకుపసరు తాగించారు. అనంతరం కేజీబీవీ సిబ్బందితో కలిసి ప్రైవేటు వాహనంలో కర్నూలు ఆస్పత్రికి తరలించారు. విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అక్కడి వైద్యులు చెప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం దాక్షాయినిని తల్లిదండ్రులు తమ స్వగ్రామానికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే విజయుడు విద్యార్థిని తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కాగా, పాముకాటుకు గురైన విద్యార్థినికి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించే వరకు కేజీబీవీ ఎస్ఓ పరిమళ అందుబాటులో లేకపోవడం గమనార్హం. కేజీబీవీ సిబ్బందే విద్యార్థిని బాగోగులు చూసుకున్నారు. అయితే మధ్యాహ్నం తర్వాత కర్నూలు ఆస్పత్రికి ఎస్ఓ వెళ్లి విద్యార్థినిని పరామర్శించినట్లు తెలిసింది.



కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని దాక్షాయిని

జడ్చర్లకు బైపాస్ మంజూరు



జడ్చర్ల పట్టణ వ్యూ

బైపాస్ సాధించుకుంటాం..

జడ్చర్ల బైపాస్ నిర్మాణానికిగాను బుధవారం ఎంపీ డీకే అరుణ, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఢిల్లీలో కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిశాం. ఇందుకు సంబంధించిన డీపీఆర్‌ను కూడా సమర్పించాం. పరిశీలించి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. నిరంతరం పర్యవేక్షణ చేస్తూ త్వరగా నిధులు మంజూరు చేయించేందుకు కృషిచేస్తాం.

– జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

- కేంద్ర రవాణాశాఖ మంత్రిని కలిసిన ఎంపీ, జడ్చర్ల, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యేలు
- డీపీఆర్ అందజేత.. పరిశీలించి నిధుల కేటాయింపునకు హామీ

జడ్చర్ల టౌన్: జడ్చర్లలో బైపాస్ నిర్మాణానికి కేంద్ర రవాణాశాఖ ఎట్టకేలకు పచ్చజెండా ఊపింది. బుధవారం ఢిల్లీలో మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, జడ్చర్ల, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యేలు జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కేంద్ర రవాణాశాఖమంత్రి నితిన్ గడ్కరీని కలిసి బైపాస్ ఆవశ్యకతను వివరించి ఇందుకు సంబంధించిన డీపీఆర్‌ను ఆయనకు అందజేశారు. డీపీఆర్ పరిశీలించి నిధులు విడుదల చేస్తామని కేంద్ర మంత్రి భరోసానిచ్చారు.

⇨ దినదినాభివృద్ధి చెందుతున్న జడ్చర్ల మీదుగా 44, 167వ నంబరు రెండు జాతీయ రహదారులు వెళ్తున్నాయి. ముఖ్యంగా నియోజకవర్గకేంద్రం మీదుగా 167వ నంబరు జాతీయ రహదారి వెళ్తోంది. రహదారి నిర్మాణ పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. ఈ రోడ్డుపై పదేళ్లలో వాహనాల రాకపోకలు నాలుగు రెట్లు పెరగడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది. ఈ సమస్యను అధిగమించేందుకు బైపాస్ నిర్మాణం ఒక్కటే మార్గమని నిర్ణయించిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఇదివరకే రెండు పర్యాయాలు కేంద్రమంత్రిని కలిసి సమస్యను విన్నవించారు. బుధవారం మరోమారు మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఢిల్లీలో కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరిని కలిసి బైపాస్ ఆవశ్యకతను వివరించారు. ఎంపీ బైపాస్‌కు సంబంధించిన డీపీఆర్‌ను కేంద్ర మంత్రికి అందించారు. స్పందించిన మంత్రి బైపాస్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో పాటు డీపీఆర్‌ను పరిశీలించాలని జాతీయ రహదారులశాఖ అధికారులను ఆదేశించారు. డీపీఆర్ పరిశీలన అనంతరం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.

పట్టణ దక్షిణభాగం నుంచి..

జడ్చర్ల–మహబూబ్‌నగర్ 167వ నంబరు జాతీయ రహదారిపై ఉన్న నక్కలబండ తండా నుంచి మల్లెబోయిన్‌పల్లి మీదుగా 44వ నంబరు జాతీయ రహదారిని కలుపుతూ తాటిపర్తి, ఆలూరు, బూర్గుపల్లి, కిష్టంపల్లి, నాగసాల, చర్లపల్లి మీదుగా గంగాపురం వద్ద తిరిగి అదే జాతీయ రహదారిని కలిపేలా ప్రతిపాదనలు రూపొందించారు. అలాగే మహబూబ్‌నగర్ బైపాస్ రహదారి పనుల్లో వేగం పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కేంద్రమంత్రిని కోరారు. ఇందుకు కూడా కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు.

పింఛన్ పెంపు హామీ ఏమైంది?

- నిస్సహాయ స్థితిలో జీవిస్తున్న వారికి అన్యాయం చేయొద్దు
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ
- ముచ్చోనిపల్లెలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



ముచ్చోనిపల్లెలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాల వేస్తున్న మందకృష్ణమాదిగ

గట్టు: వృద్ధులు, వికలాంగులకు ఇచ్చే పింఛన్లు పెంచుతామని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ఏమైందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ ప్రశ్నించారు. బుధవారం గట్టు మండలం ముచ్చోనిపల్లెలో భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల కోసం రాజీ లేని పోరాటం చేసి, వారి బతుకుల్లో వెలుగులు నింపిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. అంబేడ్కర్ స్ఫూర్తితో యువత ముందుకుసాగాలని కోరారు. కాళ్లు, చేతులు లేనోళ్ల పింఛన్ డబ్బులు ఎగొట్టడం రేవంత్ సర్కారుకు భావ్యం కాదన్నారు. ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఉన్న పింఛన్లు పెంచకుండా, కొత్త పింఛన్లు ఇవ్వకుండా 18వేల కోట్ల బడ్జెట్ పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. నిస్సాహాయ స్థితిలో చేయూత పింఛన్‌పై ఆధారపడి జీవిస్తున్న వారికి అన్యాయం చేయొద్దన్నారు. పింఛన్‌దారుల బాధ అటు ప్రభుత్వానికి, ఇటు ప్రతిపక్షాలకు కనిపించడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం దగా చేస్తుంటే రాజకీయ పార్టీలు ఎందుకు మౌనం వహిస్తున్నాయని ప్రశ్నించారు. పింఛన్‌దారులకు ఇచ్చిన హామీల సాధన కోసం వచ్చే నెల 13న హైదరాబాద్‌లో పెద్దఎత్తున ఆందోళన చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత, బీఆర్ఎస్ గద్వాల నియోజకవర్గ ఇన్‌చార్జి బల్గెర హనుమంతు నాయుడు, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు కిషోర్‌కుమార్, కొంకల భీమన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి బుర్ర సతీశ్ మాదిగ, ఎంఎస్ఎస్‌పీ జిల్లా కన్వీనర్ రాజు, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి అశోక్, మండల అధ్యక్షుడు బల్గెర ఏసన్న తదితరులు పాల్గొన్నారు.

అర్చకుల సంక్షేమానికి నిరంతరం కృషి



మాట్లాడుతున్న అర్చక సంఘం ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: దూప, దీప నైవేద్య అర్చకుల సంక్షేమం కోసం రాష్ట్ర దూప, దీప నైవేద్య అర్చక సంఘం నిరంతరం కృషి చేస్తుందని ఆ సంఘం ఉమ్మడి జిల్లా ప్రతినిధులు అన్నారు. మహబూబ్‌నగర్‌లో బుధవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలోని 6,750 మంది అర్చకుల అభ్యున్నతి కోసం పనిచేస్తున్న రాష్ట్ర దూప, దీప నైవేద్య అర్చక సంఘంపై అర్చక వెల్ఫేర్ బోర్డు సభ్యుడు జక్కాపురం నారాయణస్వామి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 14, 15, 16 తేదీల్లో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, లోకకల్యాణార్థం దూప, దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవశర్మ ఆధ్వర్యంలో చండీ కుబేర పాశుపత యాగాన్ని దిగ్విజయంగా పూర్తి చేసినట్లు తెలిపారు. దీనిని జీర్ణించుకోలేని కొందరు అర్చక సమాఖ్య నాయకులు ఏదో విధంగా దూప, దీప నైవేద్య అర్చక సంఘంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర దూప, దీప నైవేద్య అర్చక సంఘం చేస్తున్న కార్యక్రమాలకు అడ్డుపడవద్దని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి జి.రవికుమార్, మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల, పేట జిల్లాల అధ్యక్షులు జంగం మహేష్, లక్ష్మీకాంతాచార్యులు, చంద్రశేఖర్, చక్రవర్తి చార్యులు, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

‘108’లో ఆక్సిజన్ లేక రైతు మృతి?



బొజ్జయ్య మృతదేహం

మహబూబ్‌నగర్ క్రైం: ఛాతీలో నొప్పి రావడంతో 108 అంబులెన్స్‌లో తరలించే క్రమంలో అందులో ఆక్సిజన్ లేకపోవడంతో రైతు మృతి చెందిన సంఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో చోటు చేసుకుంది. మూసాపేట మండలం నిజాలాపూర్ గ్రామానికి చెందిన బొజ్జయ్య(65) బుధవారం తన వ్యవసాయ పొలంలో ఉండగా ఛాతీలో నొప్పి రావడంతో కుటుంబసభ్యులు మూసాపేటలోని ఓ ఆర్ఎంపీ దగ్గరకు తీసుకువెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్ వెళ్లడానికి ‘108’కి కాల్ చేశారు. దాదాపు 20 నిమిషాల తర్వాత అక్కడికి చేరుకున్న 108 వాహనంలో బొజ్జయ్యను తీసుకుని జిల్లాకేంద్రంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బొజ్జయ్యను పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. దీంతో మృతుడి కుటుంబసభ్యులు 108లో ఆక్సిజన్ సదుపాయం లేకపోవడం వల్లే మృతి చెందాడని ఆరోపిస్తున్నారు. సిబ్బందికి ఆక్సిజన్ పెట్టాలని కోరినా పెట్టాలేదని వారు మండిపడ్డారు. ఈ ఘటనపై 108 మేనేజర్ రవిని వివరణ కోరగా.. జిల్లాలో ఉన్న ప్రతి 108లో ఆక్సిజన్ సౌకర్యం ఉంటుందని, ఈ అంబులెన్స్‌లో కూడా ఉందని తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులే అంబులెన్స్ మహిళ టెక్నీషియన్‌పై దాడి చేశారని తెలిపారు.

బోరవెల్లిలో గుప్తనిధుల కోసం తవ్వకాలు



బోరవెల్లిలో అనుమానితులను విచారిస్తున్న పోలీసులు

మానవపాడు: శతాబ్దాల చరిత్రగల బోరవెల్లి గ్రామంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు కొన్ని రోజుల క్రితం గుప్తనిధుల తవ్వకాలు జరపగా.. ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయితే, బుధవారం గ్రామంలో ఇరువురు అనుమానాస్పదంగా తిరుగుతుండగా గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ మురళి అక్కడికి చేరుకొని వారిని విచారించారు. పూర్తి వివరాలిలా.. చెన్నకేశవస్వామి ఆలయంలో కొందరు ఈ నెల 1 నుంచి 5వ తేదీ మధ్యలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపారు. అనంతరం విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈక్రమంలో ఈ నెల 14న నాగర్‌కర్నూల్‌లో పనిచేసే ఓ ప్రభుత్వ ఉద్యోగి.. బోరవెల్లి చెన్నకేశవస్వామి ఆలయంలో పూజారిగా పనిచేసే రవీంద్రనాథ్‌కు ఫోన్ చేశాడని, మీ ఆలయంలో గుప్తనిధులు ఉన్నాయని, సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా లేదా అని ఆరా తీశాడన్నారు. నువ్వు మాకు సహకరించాలని లేదంటే నీ అంతు చూస్తానని భయభ్రాంతులకు గురిచేశాడని తెలిపారు. ఇదే విషయమై గ్రామస్తులంతా పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. ఈక్రమంలో బుధవారం గ్రామంలో ఇద్దరు అనుమానాస్పదంగా తిరుగుతుండగా పట్టుకొని పోలీసులకు గ్రామస్తులు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ అక్కడికి చేరుకొని ఇరువురు వ్యక్తులను స్టేషన్‌కు తరలించారు. ఈక్రమంలో పూజారిని బెదిరించిన వ్యక్తిని గ్రామానికి రప్పించాలని, వారికి వీరికి సంబంధం ఉందంటూ గ్రామస్తులు పోలీసుల వాహనాన్ని అడ్డుకున్నారు. అనంతరం వారిని స్టేషన్‌కు తరలించి విచారించారు. ఇదిలాఉండగా, పూజారి రవీంద్రచారి తనను ఫోన్‌లో బెదిరింపులకు పాల్పడ్డ వ్యక్తి అయిన ప్రభుత్వ ఉద్యోగిపై ఫిర్యాదు చేశాడు. అయితే, తవ్వకాల విషయమై విచారించి పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్ఐ తెలిపారు.

మహబూబ్‌నగర్ విజయం

- 161 పరుగుల తేడాతో వెస్ట్‌మారేడ్‌పల్లిపై గెలుపు
- హెచ్‌సీఏ బీ–డివిజన్ టూ డే లీగ్



ముఖితుద్దీన్ (5 వికెట్లు)



విజయం సాధించిన మహబూబ్‌నగర్ జట్టు

మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లో జరిగిన హెచ్‌సీఏ బీ–డివిజన్ టూ డే లీగ్ చాంపియన్‌షిప్‌లో మహబూబ్‌నగర్ జిల్లా జట్టు విజయం సాధించింది. జిల్లా జట్టు 161 పరుగుల తేడాతో వెస్ట్‌మారేడ్‌పల్లిపై గెలుపొందింది. మొదట బ్యాటింగ్ చేసిన జిల్లా జట్టు 85.1 ఓవర్లలో 300 పరుగులకు ఆలౌట్ అయింది. బుధవారం రెండో రోజు బ్యాటింగ్ చేసిన వెస్ట్‌మారేడుపల్లి 56.4 ఓవర్లలో 139 పరుగులకు కుప్పకూలింగింది. మహబూబ్‌నగర్ బౌలర్ ముఖితుద్దీన్ 17.4 ఓవర్లలో 30 పరుగులిచ్చి 5 వికెట్లు తీశాడు. ఇతర బౌలర్లు జస్వంత్ 3, జయసింహ 1 వికెట్ తీశారు. విజయం సాధించిన జట్టును ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అభినందించారు.

ఫార్మసీ, ఐసీ, బీఎడ్, ఎంఎడ్ ఫలితాలు విడుదల



పీయూలో ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ శ్రీనివాస్ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూ పరిధిలోని ఫార్మసీ, ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ, బీఎడ్, ఎంఎడ్ పరీక్ష ఫలితాలను వీసీ శ్రీనివాస్ బుధవారం విడుదల చేశారు. ఈ మేరకు ఫార్మసీలో 6వ సెమిస్టర్‌లో 100శాతం ఉత్తీర్ణత, ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీలో 100శాతం, బీఎడ్ సెమిస్టర్ 2లో 30.28శాతం, బీఎడ్ సెమిస్టర్ 6లో 65.91శాతం, ఏంఎడ్ సెమిస్టర్ 1లో 73.33, సెమిస్టర్‌లో 3లో 52.58శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలను పీయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని, అభ్యంతరాలు ఉంటే రీవాల్యువేషన్ కోసం దరఖాస్తులు చేసుకోవాలని కంట్రోలర్ ప్రవీణ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవికాంత్, కరుణాకర్‌రెడ్డి, సురేష్, ఈశ్వర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కోర్సులో అడ్మిషన్లు



మొదటి అడ్మిషన్ పొందుతున్న టీనాకుమారి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీయూలో నూతనంగా ప్రారంభించిన ఇంజనీరింగ్ కోర్సుల్లో విద్యార్థులు అడ్మిషన్లు పొందుతున్నారు. టీఎస్ఎఫ్‌సెట్ ఎంట్రెన్స్ ద్వారా అడ్మిషన్లు పొందిన విద్యార్థులు ఈ నెల 28 వరకు ఆన్‌లైన్ రిపోర్టింగ్ చేయాల్సి ఉండగా.. ఆగస్టు 2 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేయాల్సి ఉంది. ఈ క్రమంలో మొదటి అడ్మిషన్‌ను గద్వాల్ జిల్లాకు చెందిన టీనాకుమారి తీసుకోగా.. అక్నాలెడ్జ్‌మెంట్‌ను ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ అందించారు.

ప్రేమ పెళ్లి వద్దన్నారని.. బాలిక ఆత్మహత్య

మానవపాడు: తాను ప్రేమించిన వ్యక్తితో పెళ్లి చేయడం లేదని ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మానవపాడు మండలం గోకులపాడులో చోటు చేసుకుంది. ఎస్ఐ చంద్రకాంత్ వివరాల మేరకు.. ఏపీలోని కర్నూలు జిల్లా రేమట గ్రామానికి చెందిన ఎర్రల గిరిబాబు కూతురు ఏడో తరగతి వరకు మాత్రమే చదివి ఇంట్లోనే ఉండేది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన వ్యక్తితో ప్రేమలో పడింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు మందలించారు. ఇంకా పెళ్లి వయసు రాలేదని.. ఇలాంటి వ్యవహారాలు చేయరాదని సూచించారు. అయినప్పటికీ మాట వినకపోవడంతో ఇటీవల మానవపాడు మండలం గోకులపాడు గ్రామంలో నివాసముండే బాలిక సోదరి ఇంటికి పంపించారు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక.. ఈ నెల 28న పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు కర్నూలు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. తండ్రి ఎర్రల గిరిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చారకొండ: మండలంలోని జూపల్లి సమీపాన జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై బుధవారం ద్విచక్రవాహనం అదుపుతప్పి ఇద్దరి యువకులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కల్వకుర్తి నుంచి దేవరకొండ వైపు శంకర్, నరేష్‌లు ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తుండగా ప్రధాన రహదారి మూలమలుపు వద్ద వాహనం అదుపుతప్పి కింద పడింది. ప్రమాదంలో ఇద్దరు గాయపడటంతో 108 వాహనంలో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని చారకొండ ఎస్ఐ శంషోద్దీన్ తెలిపారు.

అన్నదాన సత్రంలో ప్రత్యేక పూజలు



అన్నదాన సత్రాన్ని పరిశీలిస్తున్న అలంపూర్ ఆలయాల ఈఓ, చైర్మన్

అలంపూర్: అలంపూర్ ఆలయాల్లోని నిత్యాన్నదాన సత్రాన్ని కొత్తగా నిర్మించిన ప్రసాద్ స్కీం భవనంలోని ఓ బ్లాక్‌లోకి మార్చనున్నారు. ఈ సందర్భంగా బుధవారం కొత్త భవనంలో ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం మహా గణపతి పూజ, పుణ్యాహవాచనం, సంప్రోక్షణ, రుత్విక్ వరుణం, మహా కలశ స్థాపన, వాస్తు మండపారాధన, గణపతి, నవగ్రహ, వాస్తు, రుద్ర హోమం జరిగాయి. అనంతరం ఈఓ, చైర్మన్ అర్చకులకు దీక్షా వస్త్రాలు అందజేశారు. గురువారం తెల్లవారుజామున 4.34 గంటలకు గో సహిత గృహప్రవేశం, ఉదయం 11 గంటలకు పూర్ణాహుతి ఉంటుందని ఈఓ వివరించారు. మధ్యాహ్నం 12 గంటలకు జోగుళాంబ బాల బ్రహ్మేశ్వరస్వామి కల్యాణం, అనంతరం కొత్త అన్నదాన సత్రంలో భక్తులకు అన్న ప్రసాదం(భోజనం) ఉంటుందని తెలిపారు. ఈఓ, చైర్మన్ కొత్త అన్నదాన సత్రంలో ఏర్పాట్లను పరిశీలించారు.

పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటు పేదలకు వరం


- రెండు పాఠశాలలకు రూ.31 కోట్లు మంజూరు
- విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి



మాట్లాడుతున్న ఆకునూరి మురళి

వంగూరు: తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటు పేద విద్యార్థులకు వరమని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. నూతనంగా ఏర్పాటవుతున్న వంగూరు, పోల్కంపల్లి పాఠశాలల్లో నిర్వహణకు సంబంధించి గ్రామ అభివృద్ధి కమిటీ, ఎస్ఎంసీ కమిటీలతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయనతో పాటు కమిటీ సభ్యులు చారకొండ వెంకటేష్, విశ్వేశ్వర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంగూరు, పోల్కంపల్లి పాఠశాలల్లో తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటు కోసం రాష్ట్ర ప్రభుత్వం దాదాపు రూ.31 కోట్ల నిధులను మంజూరు చేసిందని తెలిపారు. పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వ అధికారులతో పాటు గ్రామస్తుల సహకారం ఉండాలని కోరారు. వంగూరు పాఠశాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. అంతేకాకుండా నూతనంగా రెండు బస్సులు కొనడంతో పాటు ప్రహరీ, పరిసరాలను శుభ్రం చేయడం లాంటి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆయన పేర్కొన్నారు. నిధుల వినియోగంలో ఒక్క పైసా అవినీతి జరగకుండా చూడాలని సూచించారు. చారకొండ వెంకటేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సొంత మండలమైన వంగూరులోనే రెండు పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేయడం గర్వంగా ఉందన్నారు. సమావేశంలో ఈఈ రాంచందర్, నోడల్ ఆఫీసర్ గోపాల్, ఎంఈఓ మురళీ మనోహరాచారి తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు భారీ వరద



జూరాల క్రస్టు గేట్ల ద్వారా దిగువకు పారుతున్న వరద

- 15 క్రస్టు గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

ధరూరు/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద వచ్చి చేరుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం సాయంత్రం 6.30 గంటల వరకు ప్రాజెక్టుకు లక్షా 78వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 15 క్రస్టు గేట్లను ఎత్తి లక్షా 49వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జల విద్యుత్ కేంద్రంలో 11 యూనిట్లలో విద్యుదుత్పత్తిని కొనసాగిస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 26,345 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315, నెట్టెంపాడుకు 750, ఆవిరి రూపంలో 43, ఎడమ కాల్వకు 1,250, కుడి కాల్వకు 600, సమాంతర కాల్వకు 800.. ప్రాజెక్టు నుంచి మొత్తం లక్షా 79,413 క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.894 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పరుగులు పెడుతున్న విద్యుదుత్పత్తి

ప్రాజెక్టు ఎగువలో 5 యూనిట్ల ద్వారా 175.189 ఎంయూ, దిగువలో 6 యూనిట్ల ద్వారా 208.276 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటి వరకు 383.465 మిలియన్ యూనిట్లును విజయవంతంగా విద్యుదుత్పత్తిని చేపట్టామన్నారు.

సుంకేసులకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసులకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో బుధవారం కొనసాగింది. ఎగువ నుంచి 1,25,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 10 గేట్లను ఒక మీటర్ మేర.. 11 గేట్లను 2 మీటర్ల మేర తెరిచి 1,22,326 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కేసీ కెనాల్‌కు 1,847 క్యూసెక్కులను వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.